సాక్షి
శ్రీకాకుళం

మంగళవారం । 11 । జూలై । 2023



సేవాలయాలు..

ఆర్‌బీకేలు అవసరానికి ఆదుకుంటున్నాయి. రైతుల పాలిట సేవాలయాలుగా మారాయి.

- 8లో



అంత్యక్రియలు పూర్తి..

పడవ బోల్తా ఘటనలో మృతుని అంత్యక్రియలు పూర్తయ్యాయి. మరొకరి ఆచూకీ ఇంకా లభించలేదు.

- 8లో

గురుకులానికి అరుదైన గౌరవం

బూర్జ: కొల్లివలస బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయానికి అరుదైన గౌరవం దక్కింది. ఐఐఎస్ఈఆర్ పూణెలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు జయంతి విశ్వేశ్వరరావు గణితంపై రూపొందించిన ప్రాజెక్టును ప్రదర్శించారని, దీనికి ప్రశంసా పత్రం లభించిందని ప్రిన్సిపాల్ నూక రామకృష్ణ తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వం ద్వారా చైల్డ్‌లైన్ సేవలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వం ద్వారా నేరుగా చైల్డ్‌లైన్ సేవలు అందుతాయని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఇప్పటి వరకు చైల్డ్ లైన్ (1098) సేవలు చైల్డ్‌లైన్ ఇండియా ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా అందేవని, ఇప్పుడు జిల్లాల్లో బాలల పరిరక్షణ విభాగంతో అనుసంధానించారని వివరించారు. జూలై 7 అర్ధరాత్రి నుంచి దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఆధీనంలో హెల్ప్‌లైన్ పని చేస్తుందన్నారు. దీన్ని సోమవారం స్పందన హాల్‌లో ఆయన లాంఛనంగా ప్రారంభించారు. నిస్సహాయ బాలల కోసం ఈ చైల్డ్ హెల్ప్‌లైన్(1098) పనిచేస్తుందని మహిళ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి జయదేవి తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్, జేసీ ఇతర అధికారులు చైల్డ్ హెల్ప్ లైన్ సేవలకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. అలాగే చైల్డ్ హెల్ప్ లైన్‌లో పని చేసేందుకు సిబ్బందికి తాత్కాలిక ప్రాతిపదికన షరతులతో కూడిన ఒప్పంద నియామక పత్రాలను అందజేశారు.

22న ప్రత్యేక లోక్ అదాలత్



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రత్యేక లోక్ అదాలత్‌ను ఈ నెల 22న నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఆయన సోమవారం తన చాంబర్‌లో పలు బీమా కంపెనీల ప్రతినిధులు, లాయర్లతో మాట్లాడారు. మోటార్ యాక్సిడెంట్ కేసులు, ల్యాండ్ ఎక్విజేషన్ కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల సమయం ఆదా అవుతుందన్నారు.

వంశధార కుడి కాలువలో నిండుగా సాగునీరు



వంశధార కాలువలో సాగునీటి ప్రవాహం

ఎల్.ఎన్.పేట: వంశధార కుడి ప్రధాన కాలువలో సాగునీటి ప్రవాహం జోరందుకుంది. వంశధార కుడి కాలువలోకి రెండు రోజుల కిందట సాగునీరు విడిచిపెట్టడంతో కాలువ కళకళలాడుతోంది. రైతులు పంట పొలాలకు, నారుమడులకు నీటిని మళ్లించగా మరి కొన్ని గ్రామాలకు చెందిన రైతులు సాగునీటి చెరువులను నింపుతున్నారు. వారం రోజుల్లో చెరువులు నిండిపోతే దమ్ములు, నాట్లు వేసే పనులు ప్రారంభిస్తామని జాడుపేట, ఎఫ్‌డీ పేట, కుశమలపాడు, చింతలబడవంజ, రావిచెంద్రి, ముంగెన్నపాడు, బరటాం, కృష్ణాపురం తదితర గ్రామాలకు చెందిన రైతులు చెబుతున్నారు.

స్పందనకు 232 అర్జీలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్, ఇతర అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్పందన అర్జీలు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమంలో పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ మురళీకృష్ణ, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ పాల్గొన్నారు. స్పందన, ఏపీ సేవ, మీ సేవ కింద అందిన అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ వారం స్పందనకు 232 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి, జిల్లా ఉద్యాన అధికారి ప్రసాదరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

ఎస్పీ స్పందనకు 57 అర్జీలు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ఎస్పీ స్పందనకు 57 అర్జీలు అందాయి. కార్యక్రమంలో ఎస్పీ రాధికతో పాటు అదనపు ఎస్పీలు హాజరయ్యారు.



కాశీబుగ్గ: నిరసన తెలుపుతున్న పలాస వలంటీర్లు



టెక్కలి: పవన్ దిష్టిబొమ్మను దహనంచేసి నిరసన తెలుపుతున్న వలంటీర్లు



టెక్కలి: వలంటీర్ల మానవహారం



సోంపేట: పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

అనుచిత వ్యాఖ్యలు..
ఆగ్రహ జ్వాలలు

జనసేన అధినేత పవన్ కల్యాణ్ వలంటీర్ల వ్యవస్థపై చేసిన అనాలోచిత వ్యాఖ్యలపై సిక్కోలు మండిపడింది. జిల్లావ్యాప్తంగా సోమవారం వలంటీర్లు ఊరూరా నిరసన కార్యక్రమాలు, ఆందోళనలు చేశారు. పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మలు, చిత్రపటాలను దహనం చేశారు. పలుచోట్ల ఆయన చిత్రపటాలను చెప్పులతో దండించారు. మానవ హారాలు చేసి, పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. తాము చేస్తున్న సేవను గుర్తించకుండా రాజకీయ ఉనికి చాటుకోవడానికి ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

– సాక్షి నెట్‌వర్క్

బహిరంగ క్షమాపణ చెప్పాలి



రాజకీయాల్లో అపరిపక్వతకు మారుపేరుగా నిలిచిన పవన్ కల్యాణ్ వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలి. కరోనా వంటి విపత్కర పరిస్థితిల్లోనూ ప్రాణాలకు తెగించి అత్యుత్తమ సేవలందించిన వలంటీర్లపై కారుకూతలు కూస్తే ఊరుకునేది లేదు.

– మద్దిలి కాళిదాస్, వలంటీర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు

టీడీపీ దత్తపుత్రుడు, ప్యాకేజీ నేత పవన్ కల్యాణ్‌కు వలంటీర్‌లను విమర్శించే అర్హత లేదు. ఇలాంటి వ్యాఖ్యలు పవన్ కల్యాణ్ అవివేకానికి నిదర్శనం. బహిరంగ క్షమాపణ చెప్పాలి.

–కొత్తూరులో జరిగిన నిరసన కార్యక్రమంలో వలంటీర్లు

జనసేన నేత పవన్‌కల్యాణ్‌కు స్వచ్ఛంద సేవకు అర్థం తెలుసా.. పవన్ రాజకీయ లబ్ధి కోసం ఆరాట పడుతూ స్వచ్ఛంద సేవకులపై నోరు జారడం సరికాదు. అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలి.

–కాశీబుగ్గలో జరిగిన నిరసనలో వలంటీర్లు

మా సేవలను గుర్తించక పోగా మాపై ఆరోపణలు చేయడం దారుణం. క్షమాపణ చెప్పకుంటే నిరసనకార్యక్రమాలు ఉధృతం చేస్తాం.

–సోంపేటలో జరిగిన నిరసనలో వలంటీర్లు

అవినీతి రహితం
సంక్షేమ స్వర్ణయుగం



'ఒక సామాన్యుడు ప్రభుత్వ కార్యాలయానికి వెళ్తే నిమిషాల వ్యవధిలో అతని పని జరుగుతోంది. ఒక అర్హుడు పథకానికి దరఖాస్తు చేసుకుండా కచ్చితంగా లబ్ధి అందుతోంది. ఒక విద్యార్థికి బడిలో అడుగు పెట్టిన తొలిరోజే పుస్తకాల నుంచి బ్యాగు వరకు, షూ నుంచి యూనిఫాం వరకు అన్నీ అతని చేతిలో పెడుతున్నారు. వీధి బడులు సకల వసతులతో సగర్వంగా నిలబడుతున్నాయి. ప్రభుత్వ దవాఖానాలు సర్వసన్నద్ధంగా తయారయ్యాయి. ఒకటో తేదీ రావడమే లేటు ఇంటి తలుపు తట్టి మరీ పింఛన్ ఠంఛన్‌గా అందిస్తున్నారు. వీధికే రేషన్ తెచ్చి ఇస్తున్నారు. విద్యార్థి నుంచి విశ్రాంత ఉద్యోగి వరకు, బాలల నుంచి వృద్ధుల వరకు అందరి సంక్షేమం కోరే ప్రభుత్వమిది' అని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తమ ప్రభుత్వ పనితీరును వివరించారు. ప్రతిపక్షాలు పనిలేక విమర్శలు చేస్తున్నాయని అన్నారు. ఆయన 'సాక్షి'తో పంచుకున్న భావాలు ఆయన మాటల్లోనే..

- పైసా అవినీతి లేకుండా పేదలకు సంక్షేమ పథకాలు
- ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మన పథకాలు
- సిక్కోలుకు చంద్రబాబు చేసిందేమీ లేదు
- సామాన్యుడికి చేరువగా పాలన
- 'సాక్షి'తో మంత్రి ధర్మాన ప్రసాదరావు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

దేశంలో సంక్షేమ పథకాల నిధులు 90శాతం దుర్వినియోగమై... కేవలం 10 శాతం మాత్రమే లబ్ధిదారునికి చేరుతున్నాయని రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు నిత్యం ఆవేదన చెందేవారు. వంద శాతం మందికి ఎలా అందించాలా అని ఆలోచించేవారు. ఇవాళ రాష్ట్రంలో ఆ మార్పు వచ్చింది. దీని కోసం వైఎస్ జగన్ ఓ విప్లవమే తీసుకువచ్చారు. వంద శాతం ప్రజలకు ఒక్క పైసా అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అందించి చూపించారు. ఇది ఓ విప్లవాత్మక మార్పు. స్వాతంత్య్రం వచ్చి ఇన్నేళ్లయినా ఒక సామాన్యుడు ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లి తనకు కావాల్సిన పనిని చేసుకోలేకపోతున్నాడు. ప్రభుత్వ కార్యాలయాల్లో జవాబుదారీతనం లేకపోవడమే దీనికి కారణం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ పరిస్థితిని సమూలంగా మార్చేసింది. సచివాలయ వ్యవస్థ ద్వారా సామాన్యుడికి కావాల్సిన పనులు నిమిషాల మీద జరుగుతున్నాయి. ఇది ప్రభుత్వం సాధించిన గొప్ప విజయం. వలంటీర్ వ్యవస్థ ద్వారా పనులు సులభమవుతున్నాయి. అప్పటికే ఒకరో ఇద్దరో అర్హులు మిగిలిపోతే 'జగనన్న సురక్ష' ద్వారా వారిని గుర్తించి మరీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారు. ప్రతిపక్షాలకు ఈ విషయాలు పట్టడం లేదు. లేనిపోని విమర్శలు చేస్తున్నారు. ఆఖరికి విద్యార్థులకు ఇచ్చే సంక్షేమ పథకాలపైనా విమర్శలు చేస్తున్నారు. విద్యార్థులకు ఓటు హక్కు ఉండదని తెలిసినా పసలేని వ్యాఖ్యలు చేస్తున్నారు.

'జగనన్న సురక్ష' ఓ వరం



సంక్షేమ పథకాలు అందని వారికి జగనన్న సురక్ష ఓ వరం లాంటిది. ఇందులో 11 సర్వీసులు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఒక్కో గ్రామంలో 200 నుంచి 400 మంది ప్రజలు ఈ సర్వీసులు ఉపయోగించుకుంటున్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలోనే 25వేల మంది ప్రభుత్వ సేవలు అందుకున్నారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఎంత మంది ఉంటారో అర్థం చేసుకోవచ్చు. వలంటీర్, అధికారులు ప్రజల ఇంటికే వెళ్తుండడం వల్ల ఎవరికీ రోజు కూలీ నష్టపోవాల్సిన అవసరం ఉండదు. ఫ్యామిలీ సర్టిఫికెట్లు, మ్యుటేషన్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందడం ఇదివరకు ఎంత కష్టమో అందరికీ తెలిసిందే. కానీ జగనన్న సురక్ష పథకం ఈ పనిని చాలా తేలిక చేసి చూపించింది.

సిక్కోలులో ప్రగతి జాడలు..



గత నాలుగేళ్లలో జిల్లాలో చాలా అభివృద్ధి పనులు జరిగాయి. పలాసలో రూ.60 కోట్లతో ఒక రీసెర్చ్ ఆస్పత్రిని తెచ్చాం. అలాగే మంచినీళ్లపేట వద్ద హార్బర్ (ఫిష్ లాండింగ్ సెంటర్)ను ఏర్పాటు చేశాం. రూ.4000 కోట్లతో మూలపేట పోర్ట్ ప్రాజెక్టును నిర్మిస్తున్నాం. బుడగట్ల పాలెం వద్ద ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు, ఆమదాలవలసలో హార్టికల్చర్, అగ్రికల్చరల్ కళాశాలలు, శ్రీకాకుళంలో 900 పడకల ఆస్పత్రిని సంపూర్ణంగా అభివృద్ధి చేశాం. జిల్లావ్యాప్తంగా రోడ్లు నిర్మితమవుతున్నాయి. ఏం అభివృద్ధి జరిగిందని అడిగే టీడీపీ వాళ్లు వీటిని చూడాలి. జిల్లా వ్యాప్తంగా నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి.

ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయి..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పనితీరు చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయి. అందుకే టీడీపీ విమర్శలు చేస్తూ పబ్బం గడుపుకుంటోంది. అభివృద్ధి అంటే భౌతికంగా కనిపించే అంశాలే అనే భావన చాలా మందిలో ఉంది. ఒక కుటుంబం జీవన ప్రమాణాలు పెంచేదే అభివృద్ధి. విద్య, వైద్యం, పోషకాహారం, భవిష్యత్ తరాలకు ధీమా, నివాసయోగ్యమైన ఇళ్లు, మంచి వస్త్రాలు.. ఇవన్నీ జీవన ప్రమాణాలకు కొలమానం. ఈ ప్రయోజనాలు అందించకుండా ఏదేదో చేసేశామంటే ఎవరూ హర్షించరు. వైఎస్ జగన్ సర్కారు ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంలో సఫలమైంది.

అన్నదాతకు భరోసా..



రైతులకు సంబంధించి రైతు భరోసా కేంద్రం ఏర్పాటు, వారికి కావాల్సిన సమాచారం ఇచ్చేలా చర్యలు చేపట్టాం. గతంలో మండలానికి ఇద్దరు, ముగ్గురు వ్యవసాయ అధికారులు ఉంటే ఇపుడు ప్రతి మండలానికి 25మంది వ్యవసాయ అధికారులు ఉండేలా ఏర్పాటు చేశాం. అదే గ్రామంలో ఎరువులు అందుబాటులో ఉంచడం, పండిన పంట కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేశాం. కళ్ల ఎదుటే సచివాలయాలు, ఆస్పత్రులు, పాఠశాలలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు ఇలా ప్రతి రంగంలో అభివృద్ధి చేపడితే ప్రతిపక్షాలు చూడలేకపోతున్నాయి. విమర్శించేవారు వారి గ్రామాన్ని ఒకసారి పరిశీలించాలి. ఏం జరిగిందో? ఏం జరగలేదో? వారే చూస్తారు.

అవినీతికి ఆస్కారం లేకుండా..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల్లోనూ అవినీతి చోటు చేసుకుంది. ఏమిటీ పరిస్థితులని ఒక రకమైన ఆవేదనతో ప్రజలు తీర్పు ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత అవినీతికి చరమ గీతం పాడి పారదర్శకతకు పెద్దపీట వేశారు. ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపంలో లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లలోకి నేరుగా రూ.2,30,000 కోట్లు జమ చేసింది. ఇందులో ఫలానా వ్యక్తి డబ్బులు అడిగారని గానీ, తాము ఒక పైసా ఇచ్చామని గానీ ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదు.

చంద్రబాబు ఏం చేశారు..?

టీడీపీ హయాంలో జిల్లాకు ఎలాంటి మేలు జరగలేదు. ఎల్లో మీడియా ద్వారా ఆహా, ఓహో ప్రచారం చేసుకోవడం తప్ప టీడీపీ నాయకులు చేసిన పనులేవీ లేవు. తోటపల్లి, వంశధార, మెడికల్ కళాశాల, పోర్టు, ఫిషింగ్ హార్బర్, ఆఫ్‌షోర్ తదితర ప్రాజెక్టుల్లో టీడీపీ పాత్ర ఏమీ లేదు. ఇదంతా వైఎస్సార్ హయాంలో జరిగిన అభివృద్ధే. శ్రీకాకుళంలో పెద్ద మార్కెట్‌లో టీడీపీ చేసిందేమీ లేదు. మార్కెట్ పునఃనిర్మాణం ఆయన హయాంలో జరిగిందే. ఇపుడు రూ.10కోట్లు పెట్టి రోడ్లుకు టెండర్లు వేశాం. గట్టిగ మాట్లాడి ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు చెబితే ప్రజలు ఓట్లు వేస్తారనే అభిప్రాయం టీడీపీ నాయకుల్లో ఉంది.

అవన్నీ కాపీ యాత్రలే..

ఏ రాజకీయ పార్టీ అయినా తన ఉనికి కోసం ఏదో ఒక పేరుతో యాత్రలు చేస్తుంటారు. ఇందులో తప్పేమీ లేదు. ఇటువంటి యాత్రల ద్వారా అధికారం వస్తుందని అనుకుంటే పొరపాటు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేశారంటే అతను ప్రజల యొక్క ప్రతి సమస్య క్షుణ్ణంగా గమనించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ సమస్యల పరిష్కారం కోసం సంక్షేమ పథకాలు నిష్పాక్షికంగా అమలు చేశారు. మండలం నుంచి గ్రామాలకు పరిపాలనను వికేంద్రీకరించారు. ఒక్కో ప్రాంతంలో పట్టి పీడిస్తున్న సమస్యల పరిష్కారం కోసం కూడా కృషి చేశారు. ఉద్దానంలో కిడ్నీ సమస్యపై ఎన్నో రాజకీయ పార్టీలు వచ్చినా, ఏ ఒక్కరూ సమస్య పరిష్కరించ లేదు. జగన్ సీఎం అయిన వెంటనే ఉద్దానంకిడ్నీ సమస్యపై రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. వంశధార రిజర్వాయర్ నుంచి మంచినీరు ఉద్దాన ప్రాంత ప్రజలకు అందించేందుకు పనులు పూర్తి, కిడ్నీ బాధితుల మందులకు రూ.10వేలు సాయం, డయాలసిస్ కోసం అక్కడే ఆసుపత్రి ఏర్పాటు వంటి చర్యలు తీసుకున్నారు. జగన్‌ను అనుకరించాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయి. స్థిరమైన అభిప్రాయంతో ప్రతిపక్షాలు లేవనేది ప్రజల భావన.

ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం





ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు కోసం రూ.780కోట్లు ఖర్చుపెట్టాం. మరో 3-4 నెలల్లోనే ప్రారంభించనున్నాం. పలాసలో ఆస్పత్రికి రూ.60కోట్లు ఖర్చుపెట్టాం. మరో 2 నెలల్లోనే ప్రారంభించనున్నాం. వంశధారపై వివాదం కేసు సుప్రీంకోర్టులో ఉంది. లిఫ్ట్ పెట్టి 19 టీఎంసీ నింపి వేసవిలో 2లక్షల ఎకరాలకు రబీ పంటకు నీరు అందించేందుకు నిర్ణయించాం. టెండర్లు పిలిచి అనుమతులు ఇచ్చారు. ఈ వర్షాకాలం ముగిసేలోగా పూర్తి చేయాలని చెప్పాం. కోడి రామ్మూర్తి స్టేడియంపై టీడీపీ సమగ్ర ప్లాన్ లేకుండా కూలగొట్టేసింది. దీన్ని మేం బాధ్యతగా తీసుకున్నాం. దీని నిర్మాణం కోసం రూ.10కోట్లు నిధులు మంజూరు చేశాం. ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డు పని జరుగుతోంది. మరో 4-5 నెలల్లో పూర్తవుతుంది. సమగ్ర భూ సర్వేతో కొన్ని ఆక్రమణలు బయటపడుతున్నాయి. వందేళ్లుగా సర్వే జరగకపోవడంతో ఎవరిది ఏమిటో తెలియని పరిస్థితుల్లో ఆక్రమణలు జరుగుతున్నాయి. ఏ ఆక్రమణను కూడా విడిచిపెట్టేది లేదు.

కొబ్బరి రైతుల సంక్షేమానికి కృషి



రైతులకు కొబ్బరి మొక్కల్ని పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కవిటి: ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి పంట అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ అన్నారు. బొరివంకలో మండల కొబ్బరి రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య (ఎఫ్‌పీఓ) ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై కడియం నర్సరీ నుంచి తీసుకువచ్చిన కొబ్బరి మొక్కలను సోమవారం ఆమె పంపిణీ చేశారు. మండలంలోని 475 మంది రైతులకు 22,000 కొబ్బరి మొక్కల్ని పంపిణీ చేస్తున్నట్టు కవిటి ఏపీఎం కె.గోవింద్ తెలిపారు. వాపస్ అనే స్వచ్ఛంద సంస్థ సగం నిధుల్ని తిత్లీ తుఫాన్ ప్రభావిత కొబ్బరి రైతులను అభివృద్ధి చేసేందుకు సమకూర్చిందని ఏపీఎం గోవింద్ తెలిపారు. ఒక్కో మొక్కకు రైతుల వాటా రూ.20 చెల్లించగా మరో రూ.20 ను వాపస్ సంస్థ భరించిందన్నారు. ఈ మొక్కల్ని తిత్లీ తుఫాన్‌కు నేలకొరిగిన చెట్ల స్థానంలో నాటుకునేందుకు వీలుగా సరఫరా చేసినట్టు ఎఫ్‌పీఓ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ అధ్యక్షుడు బల్లెడ జయప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బెందాళం శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ దుద్ది సతీష్, గెస్ట్ స్వచ్ఛందసేవాసంస్థ అధ్యక్షుడు బల్లెడ శంకరరావు పాల్గొన్నారు.

మరోసారి కేజీబీవీ ఉద్యోగార్థుల సర్టిఫికెట్ల పరిశీలన

శ్రీకాకుళం న్యూకాలనీ: కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో వివిధ పోస్టులకు ఎంపికైన మహిళా అభ్యర్థుల సర్టిఫికెట్లను మరోసారి పరిశీలించాలని అధికారులు నిర్ణయించారు. వివిధ కారణాలతో ఉద్యోగాలకు ఎంపికకాలేనివారు చేస్తున్న ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో మరోసారి నిజనిర్ధారణ చేసుకునేందుకు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు వారు మార్కుల జాబితాను పరిశీలిస్తారు. కలెక్టర్ సూచనల మేరకు ఈ నెల ఒకటి నుంచి మూడో తేదీ వరకు ఇంటర్వ్యూలు/స్కిల్ టెస్ట్ ద్వారా ప్రిన్సిపాల్, పీజీటీ, సీఆర్టీ, పీఈటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, వారి మార్కుల లిస్టులను మరోసారి పరిశీలిస్తామని సమగ్రశిక్షా ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో ఈనెల 11వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. ఫేక్ అని తేలితే ఎంపికైన పోస్టును రద్దుచేస్తామని తెలిపారు.



ఆఫ్రికాలో భారతదేశం జెండా ఎగరవేసిన రూపాదేవి

ని'రూప'మాన విజయం

- అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటిన రూపాదేవి
- సిల్వర్ సాధించిన సిక్కోలు మణిపూస

జి.సిగడాం: చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయింది. ఆపై రెండు కాళ్లు కూడా చచ్చుబడిపోయాయి. ఆర్థిక పరిస్థితి వెక్కిరించేది. కానీ ఏ అవరోధం ఆమె లక్ష్యాన్ని మార్చలేదు. తదేక దీక్షతో సాధన చేసి అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటింది పారా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పడాల రూపాదేవి. ఆఫ్రికా ఖండంలో ఉగాండాలో ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న రూపాదేవి రజత పతకం సాధించింది.

సంతవురిటి గ్రామానికి చెందిన పడాల యశోద రెండో కుమార్తె రూపాదేవి ఆరేళ్ల వయసులోనే తండ్రిని దూరం చేసుకుంది. అప్పటి నుంచి తల్లి కష్టపడి కూతురిని చదివించింది. 2019లో ఉండగా డాబా మీద నుంచి పడిపోవడంతో రూపాదేవి రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. అయితే ఆమె తన ఆత్మస్థైర్యాన్ని కోల్పోలేదు. పారా బ్యాడ్మింటన్‌పై దృష్టి సారించి అన్ని స్థాయిల్లో రాణించింది. ఇప్పుడు ఉగాండాలో జరిగిన పోటీల్లో సిల్వర్ గెలిచింది. దీంతో ఆమెపై ప్రశంసల జల్లు కురుస్తోంది.

రాష్ట్రానికే గర్వకారణం..



పడాల రూపాదేవి అంగవైకల్యం అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో మూడు వెండిపతకాలు సాధించింది. ఆమె విజయాలు మా ఊరితో పాటు రాష్ట్రానికే గర్వకారణం. ఆమెకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తాం. సీఎం దృష్టికి కూడా తీసుకెళ్తాం.

– బుడారి లక్ష్మణరావు, సర్పంచ్, సంతవురిటి

క్లుప్తంగా

ఉత్తరేశ్వరుడిని తాకిన సూర్యకిరణాలు



సూర్యకిరణాల వెలుగులో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని బలగ మెట్టు వద్ద ఉన్న ఉమా సమేత ఉత్తరేశ్వర స్వామిని సోమవారం సూర్యకిరణాలు తాకాయి. సూర్యకిరణాలు ముద్దాడడంతో శివ లింగం బంగారు ఛాయలో మెరిసింది. ఈ విషయం తెలుసుకున్న భక్తులు స్వామి దర్శనానికి భారీగా తరలివచ్చారు.

వినియోగదారుల సంఘాల సమాఖ్య గౌరవ అధ్యక్షుడుగా బగాది



రామ్మోహనరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వినియోగదారుల సంఘాల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడుగా జిల్లాకు చెందిన సీనియర్ న్యాయవాది, జిల్లా వినియోగదారుల సంఘం సమాఖ్య అధ్యక్షులు బగాది రామ్మోహనరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని స్వాతంత్ర్య సమయోధుల సమావేశ భవనంలో ఆదివారం జరిగిన నూతన కమిటీ ఎన్నికలో ఈయన్ని ఎన్నుకున్నారు. ఈ పదవిలో ఈయన మూడేళ్లు ఉంటారు. న్యాయవాదిగా, వినియోగారుల సమాఖ్య అధ్యక్షుడుగా జిల్లా ప్రజలకు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించారు. ఈయన ఎన్నికపై న్యాయవాదులు, జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

సీసీ కామేశ్వరరెడ్డికి సత్కారం



కామేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కలెక్టర్ సీసీగా 12 ఏళ్లు పనిచేసి పదోన్నతిపై విజయవాడ వెళ్తున్న కామేశ్వరరెడ్డికి స్పందన హాల్‌లో అధికారులు సోమవారం సత్కరించారు. కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్, జేసీ ఎం.నవీన్ ఇతర అధికారులు పాల్గొని ఆయన సేవలను గుర్తు చేశారు. డీఆర్వో మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆదిత్యుడ్ని దర్శించుకున్న చోటా కే నాయుడు



అరసవల్లి: చోటా కే నాయుడు దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న మండవిల్లి రవి

అరసవల్లి/జలుమూరు: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని ప్రముఖ సినిమాటోగ్రాఫర్ చోటా కే నాయుడు కుటుంబసమేతంగా సోమవా రం దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి అంతరాలయంలో దర్శనం చేయించారు. తీర్థప్రసాదాలను అర్చకుడు ఇప్పిలి రంజిత్ శర్మ ..ఆదిత్యుని జ్ఞాపికను ఆలయ పాలక మండలి సభ్యుడు మండవిల్లి రవి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మెట్ట నాగరాజు, సరస్వతీమహల్ రాజు తదితరులున్నారు. అనంతరం చోటా కే నాయుడు విలేకరులతో మాట్లాడుతూ.. త్వరలో పెద్దకాపు సినిమా రిలీజ్ కానుందన్నారు. అలాగే మెగాస్టార్ చిరంజీవితో ఒకటి, కల్యాణ్‌రామ్‌తో బింబిసార-2 సినిమాలకు ప్రస్తుతం పని చేస్తున్నట్టు చెప్పారు. జలుమూరు మండలం శ్రీముఖలింగంలోని మధుకేశ్వరుడిని కూడా చోటా కే నాయుడు సతీసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలను అర్చకులు అందించారు.

సేవాలయాలు.. రైతు భరోసా కేంద్రాలు

- గ్రామస్థాయిలోనే అన్నదాతకు అన్ని రకాల సేవలు
- అందుబాటులో ఎరువులు
- ఆనందంలో రైతులు



రైతు భరోసా కేంద్రం

సారవకోట: రైతు సంక్షేమానికి వైఎస్సార్ కాంగ్రెస్ కృషి చేస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విత్తనాలు, రసాయన ఎరువులు, ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు కోసం మండల కేంద్రాలకు రైతులు వెళ్లాల్సి వచ్చేది. వ్యయ ప్రయాసలు తప్ప ఆశించిన ప్రయోజనం లభించేది కాదు. రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగలేక అవస్థలు పడేవారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత వీరి కష్టాలన్నీ తీరాయి. గ్రామస్థాయిలోనే వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన సేవలన్నీ అందుతున్నాయి. అన్నదాతలకు అన్ని రకాలుగా అండగా నిలుస్తూ రైతు భరోసా కేంద్రాలు సేవాలయాలుగా నిలుస్తున్నాయి.

సీఎం దూర దృష్టితో..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో నెలకొల్పిన రైతు భరోసా కేంద్రాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. 2020 మే నెల 30వ తేదీన ప్రారంభమైన ఆర్‌బీకేలను రైతులు కూడా సక్రమంగా ఉపయోగించుకుంటున్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన సేవలే కాకుండా ఉద్యానవన శాఖ, ఏపీఎంఐపీ, పశు సంవర్ధక, మత్స్య, పట్టు పరిశ్రమ, మార్కెటింగ్ శాఖల సేవలన్నీ గ్రామస్థాయిలోనే అందుతుండంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో అన్నదాతలకు సమయం, డబ్బులు ఆదా కావడంతో పాటు మండల కేంద్రాలకు వెళ్లే శ్రమ తప్పింది. జిల్లాలోని 30 మండలాలలో 656 రైతు భరోసా కేంద్రాల సిబ్బంది అన్నదాతల సేవలో నిమగ్నమయ్యాయి.

అందుబాటులో అన్ని సేవలు

వ్యవసాయంలో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి ఉత్పాదకతను పెంచడం, ఇందుకు అవసరమైన అన్ని రకాల ఇన్‌పుట్స్ అంటే విత్తనం మొదలు పండించిన పంటను మద్దతు ధరతో అమ్ముకునే వరకు ఆర్‌బీకేలు రైతులకు అండగా నిలుస్తున్నాయి. ఆర్‌బీకేల్లో వ్యవసాయ విజ్ఞానానికి సంబంధించి సుమారు 50 పుస్తకాలతో మినీ లైబ్రరీలు సైతం ఏర్పాటు చేశారు. వీటిలో పంటలకు సంబంధించిన పలు సందేహాలను నివృత్తి చేస్తారు. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తారు. ఘన, ద్రవ జీవామృతం, కషాయాల తయారీ తదితర వాటిపై రైతులకు శిక్షణిస్తారు. ఆడియో, వీడియోల ద్వారా వ్యవసాయానికి సంబంధించిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. డిజిటల్ కియోస్క్‌ల ద్వారా అవసరమైన వాటిని ఆర్డర్ పెడితే ఇంటికే చేరుతున్నాయి.

అక్రమాలకు చెక్

గతంలో ప్రైవేట్ డీలర్లు రసాయన ఎరువులను అడ్డగోలుగా అధిక ధరలకు విక్రయించే వారు. ఎంఆర్‌పీపై రూ. 50 నుంచి రూ. 100 వరకు ఎక్కువ వసూలు చేసేవారు. ఆర్‌బీకేలు ఏర్పాటైన తరువాత వీరి అక్రమాలకు చెక్ పడింది. గత ఏడాది వ్యవసాయ సీజన్లో ఆర్‌బీకేల ద్వారా 27,441 మెట్రిక్ టన్నుల ఎరువులను అందజేశారు. ఈ ఏడాది 34,589 మెట్రిక్ టన్నులు రైతులకు అందించేందుకు సిద్ధంగా కాగా ఇప్పటికే 8,600 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాలోని ఆర్‌బీకేలకు చేరాయి. 37,260 క్వింటాళ్ల వరి విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందించారు.



కియోస్క్‌లో వివరాలు నమోదు చేస్తున్న వీవీఏ

పొలంబడి.. నూతన ఒరవడి

పంటల సాగులో చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఆర్‌బీకేల వారీగా పొలంబడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ఇన్‌చార్జిలే పొలంబడి కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. వేరుశనగ, వరి, మినుము, మొక్కజొన్న కంది, చిరుధాన్యాలు తదితర పంటల్లో పొలంబడి నిర్వహిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

గతంలో ఇలా..

టీడీపీ ప్రభుత్వ హయాంలో సబ్సిడీపై పంపిణీ చేసే అరకొర విత్తనాల కోసం మండల, నియోజకవర్గ కేంద్రాల్లో రైతులు పడిగాపులు కాసేవాళ్లు. ఒక బస్తా ఎరువు అవసరమైనా పరుగెత్తాల్సి వచ్చేది. ఇన్‌పుట్ సబ్సిడీ కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా కరుణ ఉండేది కాదు. పంటను మద్దతు ధరకు అమ్ముకునేందుకు ఎన్నో ప్రయాసలు ఎదుర్కొవల్సి వచ్చేది. ఇప్పుడు ఇలాంటి కష్టాలన్నీ కనుమరుగయ్యాయి.

స్థానికంగా అన్ని సేవలందుతున్నాయి



ఉన్న గ్రామంలోనే ఆర్‌బీకేల ద్వారా అన్ని సేవలందుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పొందుతున్నాం. ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచుతున్నారు. వ్యవసాయ సిబ్బంది పంటలోకి వచ్చి ఈ క్రాప్ లో నమోదు చేస్తున్నారు. గతంలో ఎరువులు, విత్తనాల కోసం మండల కేంద్రానికి వెళ్లి క్యూ లైన్లో నిలబడి ఇబ్బంది పడేవాళ్లం.

–బోర శ్రీరామమూర్తి, రైతు, అవలింగి, సారవకోట మండలం

రైతు ముంగిట్లోకి అన్ని రకాల సేవలు



వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించిన సేవలు ఆర్‌బీకేల ద్వారా రైతు ముంగిట్లోకి అందించే ఏర్పాటు చేశాం. సబ్సిడీతో పాటు నాన్ సబ్సిడీ విత్తనాలు కూడా అందిస్తున్నాం. కస్టం హైరింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఆధునిక యంత్ర పరికరాలను అందుబాటులోకి తెచ్చాం.

–కె శ్రీధర్, జేడీ, వ్యవసాయ శాఖ

భయోత్పాతం సృష్టించే చరిత్ర టీడీపీదే

- వైస్ ఎంపీపీ వంక రాజు



మాట్లాడుతున్న వంకరాజు, గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు: తమ మాట వినని, పార్టీకి సహకరించని వారిపై కేసులు నమోదు చేసి భయోత్పాతం సృష్టించే చరిత్ర టీడీపీది, గౌతు కుటుంబానిదేనని వజ్రపుకొత్తూరు మండల ఉపాధ్యక్షుడు వంక రాజు, మంచినీళ్లపేట గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంక లక్ష్మయ్య అన్నారు. మంచినీళ్లపేటలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామ సంఘానికి సంబంధించిన సొమ్ము రూ.20 లక్షలు కైంకర్యం చేసి దాగుడు మూతలాడిన టీడీపీ నాయకుడు గుల్ల చిన్నారావును గ్రామస్తులు ప్రశ్నిస్తే అది ఓర్వలేని ఆ పార్టీ నాయకులు పత్రికలకెక్కి మంత్రి సీదిరి అప్పలరాజుపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పలాస ఎమ్మెల్యేగా అధికారం వెలగబెట్టిన గౌతు శ్యామసుందర శివాజీ వజ్రపుకొత్తూరు పోలీస్ స్టేషన్‌లో కూర్చుని వైఎస్సార్‌సీపీకి చెందిన మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు బుంగ కోటేశ్వరరావును చితకబాదించి భయోత్పాతం సృష్టించి రౌడీయిజం చేసిన సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు. మంచినీళ్లపేటలో మాజీ సర్పంచ్ గుల్ల చిన్నారావు నేర సంస్కృతి అందరికీ తెలిసిందేనన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో సర్పంచ్ అభ్యర్థిగా ఉన్న చిన్నారావు ధర్నాలు, నిరసనలు చేయడం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని భావించిన ఎలక్షన్ కమిషన్, పోలీసులు అతనిపై కేసు నమోదు చేస్తే దానికి మంత్రి సీదిరి బాధ్యుడని ఆరోపించడం ఎంత వరకు సమంజసమన్నారు. చోడిపల్లి ఏసులు ఇంటిపై చిన్నారావు తన అన్నదమ్ములతో కలిసి దాడి చేసిన ఘటనపై కేసు నమోదు అయ్యిందన్నారు. ఇళ్లపైకి మూకుమ్మడిగా వచ్చి కారం, రాళ్లు పట్టుకుని విచక్షణా రహితంగా దాడి చేస్తే కేసులు నమోదు చేయక సన్మానాలు చేస్తారా అని వ్యాఖ్యానించారు. పదేపదే కేసులు నమోదై తగాదాలకు కారణమైన వారిపై రౌడీ షీట్ తెరుస్తారన్న సంగతి టీడీపీ నేతలకు తెలియదా అని మండిపడ్డారు. పలాస నియోజకవర్గ అభివృద్ధితో పాటు మత్స్యకారుల అభ్యున్నతి పాటుపడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై టీడీపీ నాయకులు అనవసరంగా నోరు పారేసుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక వర్గానికే సంక్షేమ పథకాలు అందేవని, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమం చేరువవుతోందన్నారు. సంప్రదాయ వేట తెప్పలకు మత్స్యకార భరోసా మంజూరు చేసిన ఘనత, ఆయిల్ సబ్సిడీ, వేట సమయంలో చయనిపోయిన కుటుంబాలను ఆదుకోవడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి అప్పలరాజు ఎప్పటికీ మత్స్యకార ముద్దుబిడ్డలేనన్నారు. మంచినీళ్ల పేటలో గుల్ల చిన్నారావు అరాచకాలు, ఆగడాలపై టీడీపీ నాయకులు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గోసాల సాంబమూర్తి, కొమర మోహనరావు, సీహెచ్ జంగమయ్య, బుంగ శంకరరావు, దుమ్ము లక్ష్మయ్య ఉన్నారు.

మద్యం మత్తులో యువకుడు మృతి



సంతోష్‌కుమార్ మృతదేహం

ఎచ్చెర్ల క్యాంపస్: అధికంగా మద్యం తాగి యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన చిలకపాలెంలో సోమవారం చోటుచేసుకోగా విజయనగరం జిల్లా రాజాం మండలం పొగిరి గ్రామానికి చెందిన పొగిరి సంతోష్‌కుమార్ (32) మరణించినట్టు పోలీసులు తెలిపారు. జలుమూరు మండలం శ్రీముఖలింగంలోని అత్తవారింటికి వెళ్లి తిరిగి ప్రయాణంలో చిలకపాలెంలో మద్యం తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సాయంత్రం వరకూ లేవకపోవడంతో స్థానికుల అనుమానించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారువచ్చి పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఎచ్చెర్ల ఎస్సై వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సీఎం జగన్ చిత్రపటానికి కంద్ర కులస్తుల క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి స్పీకర్ తమ్మినేని సీతారాంతో కలిసి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ఆమదాలవలస: కంద్రకులస్తులను బీసీ–డీ నుంచి 'ఏ'జాబితాలోకి ప్రభుత్వం మార్పు చేసింది. దీంతో వారంతా ఆనందం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి మెట్టక్కివలస ప్రాంతంలోని కమ్యూనిటీ భవనం వద్ద స్పీకర్ తమ్మినేని సీతారాంతో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయన చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. గతంలో ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా తమ గోడు పట్టించుకోలేదని కంద్ర కులస్తుల సంఘ నాయకులు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తమకు అండగా ఉంటూ.. ఉద్యోగ అవకాశాలు మెరుగు పరిచేందుకు వీలుగా బీసీ–ఏ జాబితాలో చేర్చారని ఆనందం వ్యక్తం చేస్తూ.. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేనికి కృతజ్ఞతలు తెలియజేసి.. సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, మాజీ వైస్ ఫ్లోర్‌లీడర్ ఎ.ఉమామహేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు బొడ్డేపల్లి అజంతాకుమార్, ఎం.వెంకటేష్, ముఖ్యనాయకులు మామిడి రమేష్, పొన్నాడ రామారావు, పొనాడ శ్రీధర్, బిట్టు, ఎ.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో దర్శకుడు మెహర్ రమేష్

- ఆగస్టు 11న 'భోళాశంకర్' విడుదలకు సిద్ధం



మెహర్ రమేష్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్

అరసవల్లి: చిరంజీవి నటిస్తున్న భోళాశంకర్ సినిమా దర్శకుడు మెహర్ రమేష్ తన కుమార్తె మోహనతో కలిసి అరసవిల్లి సూర్యనారాయణ స్వామిని సోమవారం దర్శించుకున్నారు. ఈయనకు ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించగా.. ఆలయ విశిష్టతను శంకరశర్మ వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మునుపెన్నడూ చూడని స్టైలిష్‌లో.. మెగాస్టార్ చిరంజీవి భోళాశంకర్ సినిమాలో కనిపిస్తారన్నారు. సినిమాను వచ్చేనెల 11వ తేదీన దేశవ్యాప్తంగా విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ప్రకటించారు. అభిమానుల అంచనాలను సినిమా నిజం చేస్తోందన్నారు. మెగా ఫ్యాన్స్‌కు ఫుల్ మీల్స్ అందించడం ఖాయమన్నారు. చిరంజీవి కోల్‌కత్తాలో మరోసారి అడుగు పెట్టారని..అప్పట్లో 'చూడాలని వుంది'..ఇప్పుడు భోళాశంకర్ ద్వారా అని వివరించారు. మణిశర్మ కుమారుడు అద్భుత సంగీతాన్ని అందించారన్నారు. చిరంజీవి సినిమాకు పనిచేయడం వరంగా భావిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి, అఖిల భారత చిరంజీవి యూత్ అభిమానుల సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను, జిల్లా అభిమానుల సంఘ ప్రతినిధులు సిద్ధయ్య, మోహన్ ఉన్నారు.

మంత్రి ధర్మానను కలిసిన శిష్టకరణ సంఘ నాయకులు



మంత్రి ధర్మానతో శిష్టకరణ సంఘ నాయకులు

శ్రీకాకుళం రూరల్: రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావును శిష్టకరణ సంఘ నాయకులు తన క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఈ సందర్భంగా సంఘ నాయకులకు మంత్రి సూచించారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ అధ్యక్షుడు డబ్బీరు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సదాశివుని కృష్ణ, ట్రెజరర్ ఉరిటి కిరణబాబు, నాయకులు బలివాడ మల్లేశ్వరరావు, వినోద్, ఆర్.వి.ఎస్.శర్మ, మురళీకృష్ణ, వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఖాళీలను భర్తీ చేయాలని వినతి

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వివిధ ఉద్యోగాలను భర్తీ చేయాలని మంత్రి ధర్మాన ప్రసాదరావును ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, ఇతర సభ్యులు కలిసి కోరారు. మెగా డీఎస్సీ, గ్రూప్–1, 2 నోటిఫికేషన్ జారీ చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

ఆర్బీకేలతో రైతులకు ఎంతో లాభం

రణస్థలం: రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో అన్ని రకాల ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందడంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఏపీ సీడ్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.శేఖర్‌బాబు తెలిపారు. మండలంలోని పాతర్లపల్లి రైతు భరోసా కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఆర్‌బీకేల ద్వారా ఎలాంటి సేవలు అందుతున్నాయి, ఎలా ఉపయోగపడుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు అన్నీ సమయానికి అందుతున్నాయని చెప్పారు. ఇంకా ఏమైనా కావాలా అని అడిగితే.. రబీలో వేసే మొక్కజొన్న విత్తనాలు రాయితీపై అందించాలని, అలాగే పీవీసీ పైపులు రాయితీపై ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు పొలం గట్లపై వేసే కందుల విత్తనాలు అందజేశారు. తొలుత వెంకటరావుపేట గ్రామంలో పొలంలో పచ్చిరొట్టను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

పడవ బోల్తా మృతునికి అంత్యక్రియలు పూర్తి

- గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు..



మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎంపీపీ రఘురామ్, అధికారులు

గార: బందరువానిపేట తీరంలో అలల తాకిడికి పడవ బోల్తా పడిన సంఘటనలో మృతి చెందిన పుక్కళ్ల లక్ష్మయ్య (చిరంజీవి) మృతదేహానికి టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహం సంతబొమ్మాళి మండలంలోని తీర ప్రాంతంలో లభ్యం కాగా, టెక్కలిలో పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సూచనలతో గార ఎంపీపీ గొండు రఘురామ్, జిల్లా మత్స్యకార సంఘ అధ్యక్షుడు కోనాడ నర్సింగరావులు టెక్కలి వెళ్లి అధికారులతో మాట్లాడారు. మృతదేహాన్ని గ్రామంలోకి తీసుకువచ్చి తీరప్రాంతం ఒడ్డున అంత్యక్రియలు పూర్తి చేశారు. తహసీల్దార్ జెన్ని రామారావు, ఎఫ్‌డీవో బగాది సురేష్‌కుమార్ హాజరయ్యారు.

గాలింపు చర్యలు ముమ్మురం

పడవ బోల్తా ఘటనలో గల్లంతైన గుంటు గణపతి ఆచూకీ లభ్యం కాలేదు. విశాఖపట్నం నుంచి వచ్చిన కోస్టుగార్డు సిబ్బంది భావనపాడు తీరంలో గాలింపు చర్యలు చేపట్టారు. వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు మండల తహసీల్దార్ జెన్ని రామారావు, ఎస్ఐ ఎన్.కామేశ్వరరావులతో మాట్లాడి గాలింపు చర్యలు వేగవంతం చేయాలని సూచించారు.

ఆటో డ్రైవర్‌కు గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ గాయపడ్డాడు. ఈ సంఘటన ఎచ్చెర్ల సమీపంలో పాత జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకోగా.. ఎస్ఎం పురం పంచాయతీ లింగాలపేటకు చెందిన లింగాల కిరణ్‌కు గాయాలయ్యాయి. ఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	59,510–00
బంగారం(22కి. 10గ్రా.)	54,550–00
వెండి (కిలో)	76,700–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210